నివేదికలను సిద్ధం చేయాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : జిల్లాలో నీటి సంరక్షణ, భూగర్భ జలాలు పెంపొందించే పనులకు సంబంధించిన పూర్తి నివేదికలను క్రోడీకరించి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో నీటి సంరక్షణ, భూగర్భ జలాలు పెంచే పనులు, ప్లాంటేషన్‌లకు సంబంధించినవి, పూర్తి చేసినవి, చేయాల్సిన పనులను గుర్తించి పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని అన్నారు. ఈ నెల 8 నుంచి 10 వరకు జిల్లాలో జల్‌శక్తి అభియాన్ కేంద్ర బృందం పర్యటించకున్న సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో జడ్పీసీఈవో చందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా భూగర్భ శాఖాధికారి సతీశ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ దుర్గాప్రసాద్, జిల్లా ఉద్యానవన అధికారిణి జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 74 ఫిర్యాదులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

క్వింటాలుకు రూ. 300 కమీషన్ ఇవ్వాలి

సివిల్ సప్లై డీఎం రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : రేషన్ డీలర్లకు క్వింటాలు బియ్యానికి రూ. 300 కమీషన్ ఇవ్వాలని జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ ప్రతినిధులు ప్రజావాణిలో, సివిల్ సప్లై డీఎం రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా కమీషన్ పెంచాలన్నారు. ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఎలక్ట్రానిక్ ప్రింటెడ్ వే బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. ఏరియర్స్ విడుదల చేయాలని అన్నారు. డీలర్ చనిపోతే దహన సంస్కారాలకు రూ.50 వేలు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, గౌరవ అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు, నాగం సురేందర్, బెల్లం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : కామారెడ్డి జిల్లాలో 1:3 నిష్పత్తిలో డీఎస్సీ-2024 వివిధ కేటగిరిల్లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నట్లు డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని 223 రూం నంబర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థుల పత్రాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ జిరాక్స్ కాపీలు గజిటెడ్ అధికారి ధ్రువీకరణతో, https://schooledu.telangana.gov.in లో పొందుపరిచిన వెరిఫికేషన్ ఫాంతో సహా మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో డీఎస్సీ 2024లో పూర్తి చేసిన దరఖాస్తు ఫాం తీసుకొని రావాలని తెలిపారు.

షుగర్ తగ్గడం లేదని వ్యక్తి ఆత్మహత్య

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : షుగర్ వ్యాధితో బాధపడుతూ మనస్తాపం చెంది, పట్టణంలోని జీవదాన్ దవాఖానలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం కామారెడ్డిలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపేట మండల కేంద్రానికి చెందిన సాయిలు(40)కు వారం రోజుల క్రితం చేయికి గాయమైంది. ఇన్‌ఫెక్షన్ కావడంతో పట్టణంలోని జీవదాన్ దవాఖానలో చేరాడు. సాయిలుకు షుగర్ సైతం ఉండడంతో చికిత్స పొందుతున్నాడు. షుగర్ తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై దవాఖానలోని బాత్ రూమ్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లింగాల స్వరూప ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పౌరులు తమ హక్కులు వినియోగించుకోవాలి

రాజంపేట్, సెప్టెంబర్ 30 : మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి సంధ్యారాణి ఆధ్వర్యంలో తహసీల్దార్ అనిల్ కుమార్ అధ్యక్షతన సోమవారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి రాజ్యాంగం హక్కులను కల్పించిందని, తమ హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశం, గిర్దావార్ నజీముద్దీన్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, పంచాయతీ సెక్రటరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవునిపల్లిలో..

భిక్కనూరు, సెప్టెంబర్ 30 : మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో సివిల్స్ రైట్స్ డే సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల గురించి ఆర్ఐ బాలయ్య గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హన్మాజీపేట్ పీహెచ్‌సీలో వైద్యశిబిరం

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 30 : మండలంలోని హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీవో బషీరుద్దీన్ సందర్శించారు. ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేయాలని ఎంపీడీవో వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్, దవాఖాన సిబ్బంది ఉన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం

కామారెడ్డి రూరల్, సెప్టెంబర్ 30 : కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వయోవృద్ధుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ కొమురవ్వ వృద్ధులను గౌరవించడం నేర్చుకొని ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉమారాణి, లలిత, కల్పన, పద్మ, ఆయాలు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘం జిల్లా నూతన కార్యవర్గం

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : భారతీయ కిసాన్ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి, కార్యదర్శిగా శంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా సాయిరెడ్డి, రాజేశం, సహాయ కార్యదర్శిగా రమణారెడ్డి, లక్ష్మీరెడ్డి, భైరవరెడ్డి, లింగం, హన్మాండ్లు, రాజశేఖర్, హన్మారెడ్డి, సుధాకర్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు రంగారావు, జాతీయ కార్యదర్శి సాయిరెడ్డి, క్షేత్ర సంఘటన మంత్రి రాము, కొమిరెడ్డి, అంజన్న, ఆనంద్ రావు, జోనల్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన భారతీయ కిసాన్ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు

హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం వైదొలగాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ కల్తీ విషయమై విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర పిలుపుమేరకు సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ.. లడ్డూను కల్తీ చేసిన వారిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం వైదొలగాలని, దేవాదాయ శాఖను రద్దు చేయాలని అన్నారు. ఎండోమెంట్ బోర్డు రద్దు చేసి ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దేవాదాయ వాణిజ్య సముదాయంలోని దుకాణాలను హిందువులకు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అన్యాక్రాంతమైన దేవాలయ భూములు స్వాధీనం చేసుకొని పరిరక్షించాలన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి బొల్లి రాజు, వివిధ పార్టీల నాయకులు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ఓటరు లిస్టులో పేరును నమోదు చేసుకోవాలి

బాన్సువాడ, సెప్టెంబర్ 30 : బాన్సువాడ డివిజన్ పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు నమోదు కోసం తహసీల్ కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చని, పట్టభద్రులు ఫారం 18, ఉపాధ్యాయులు ఫారం 19(https//ceotserms2.telangana.gov.in/mlc) ఈ లింకుల ద్వారా ఓటురుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో 30 యాక్ట్ అమలు

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ 1861ని అమలు చేస్తున్నట్లు ఎస్పీ సింధూశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు 30 యాక్ట్, పోలీసు యాక్ట్ 1861 జిల్లాలో అమలులో ఉంటుందన్నారు.

సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలనుకుంటే స్థానిక పోలీసుస్టేషన్‌లో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : తెలంగాణలో జాబ్ క్యాలెండర్ ద్వారా నిర్వహించే డీఎస్సీలో ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి అభ్యర్థులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 35 ఏండ్లుగా వివిధ ప్రభుత్వాలు నిర్వహించిన డీఎస్సీ, టీఆర్‌టీలో ఖాళీగా ఉన్న 1733 ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో అభ్యర్థులు అప్పాల నరసింహ, సంధ్యారాణి, కిరణ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 30 : మండలంలోని హన్మాజీపేట్ ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ వరప్రసాద్ సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, కావాల్సిన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వార్డుల వారీగా ఓటరు లిస్టు సర్వే వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు పొందేలా అవగాహన కల్పించాలని బూత్ లెవల్ అధికారుకు సూచించారు.

విండో అభివృద్ధికి సహకరించాలి

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 30 : సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బుడ్మి సహకార సంఘం అధ్యక్షుడు గంగుల గంగారాం అన్నారు. తాడ్కోల్‌లోని రైతువేదికలో సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. విండో ఆదాయ, వ్యయాలను సొసైటీ కార్యదర్శి కృష్ణమయ్య చదివి వినిపించారు. ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలని రైతులు సభ దృష్టికి తీసుకొచ్చారు. సర్వసభ్య సమావేశానికి తిర్మలాపూర్, బుడ్మి, తాడ్కోల్, కొత్తబాది, మొగులాన్‌పల్లితండా రైతులు తరలివచ్చారు. ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జీవదాన్ ఘటన బాధాకరం

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో జరిగిన ఘటన చాలా బాధాకరమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జీవదాన్ పాఠశాలలో ఆరేండ్ల చిన్నారిపై లైంగిక దాడి కేసు లోతైన విచారణ చేపట్టి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, పట్ట ణ అధ్యక్షుడు రాజు, శ్రీనివాస్‌రెడ్డి, అంజద్ పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలి

నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ

నిజాంసాగర్, సెప్టెంబర్ 30: రాత్రివేళల్లో విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఎస్పీ సింధూశర్మ అన్నారు. నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆమె సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను గమనించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్సై సుధాకర్‌కు సూచించారు. కార్యక్రమంలో బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

నిజాంసాగర్, సెప్టెంబర్ 30: మహ్మద్‌నగర్ మండలంలోని గిర్నితండా, బూర్గుల్ గ్రామాలను ఎంపీడీవో గంగాధర్ సోమవారం సందర్శించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, గ్రామస్తులకు శుద్ధ జలాలను అందించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో గిర్ని తండా, బూర్గులు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శిరీష, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోల సభ్యత్వ నమోదు

సభ్యత్వం తీసుకుంటున్న ఉద్యోగులు

గాంధారి, సెప్టెంబర్ 30: టీఎన్జీవోస్ ఎల్లారెడ్డి డివిజన్ ఆధ్వర్యంలో గాంధారిలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్, ఎంపీడీవో, ఫారెస్ట్, ప్రభుత్వ కాలేజీలో పనిచేస్తున్న ఉద్యోగులతో సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, వి.చరణ్, రవి, రాజాగౌడ్, శ్రీకాంత్, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

మల్లాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులను అందజేస్తున్న 1980-82 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 30: మండల పరిధిలోని మల్లాయిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలోని 24 మంది విద్యార్థులకు పలువురు పూర్వ విద్యార్థులు టై, బెల్టులను సోమవారం పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 1980-82లో ఇంటర్ చదివిన విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటు విద్యార్థుల కన్నా దీటుగా ఉండాలనే ఉద్దేశంతో టై, బెల్టులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నునుగొండ మూర్తి, బాబు, నాగం చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సేవలు అభినందనీయం

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు

మద్నూర్, సెప్టెంబర్ 30: గ్రామాల్లోని చెత్తను తొలగిస్తూ.. డ్రైనేజీలను శుభ్రం చేస్తూ.. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సేవలు అభినందనీయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మద్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా కార్మికుల కోసం ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎల్పీవో నాగరాజు, తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, ఎంపీవో వెంకటనర్సయ్య, సొసైటీ చైర్మన్ శ్రీనూపటేల్, నాయకులు హన్మాండ్లుస్వామి, సాయిలు, వట్నాల రమేశ్, కొండ గంగాధర్, రాజు, హన్మంత్ యాదవ్, సచిన్, బాలు, హన్మాండ్లు, అజీంపటేల్, దీన్‌దయాల్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

దుకాణాల నిర్వహణకు వేలం

రామారెడ్డి, సెప్టెంబర్ 30: కాలభైరవ స్వామి ఆలయంలో దుకాణాల నిర్వహణ కోసం సోమవారం వేలం నిర్వహించారు. కిరాణం, పూజాసామగ్రి, కొబ్బరికాయల దుకాణాన్ని రూ.3.91లక్షలకు పెద్దకోట్ల ఆరోగ్యం దక్కించుకున్నాడు. లడ్డూ, పులిహోర, వడ విక్రయాలకు సంబంధించిన దుకాణం కోసం నిర్వహించిన వేలానికి సరైన ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు పర్యవేక్షకురాలు కమల తెలిపారు. ఆలయ ఈవో ప్రభు రాంచంద్రం, పూజారి శ్రీనివాస్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, సిబ్బంది నాగరాజు, భరత్, యాదగిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న గండిమాసానిపేట్ గ్రామస్తులు

చెరువును కబ్జా నుంచి కాపాడాలి

ఆర్డీవోకు గండిమాసానిపేట్ గ్రామస్తుల వినతి

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 30: చెరువును కబ్జా నుంచి కాపాడాలని ఎల్లారెడ్డి బల్దియా పరిధిలోని గండిమాసానిపేట్ గ్రామస్తులు ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు గండిమాసానిపేట్ గ్రామంలోని ముగుళ్ల చెరువు సర్వే నంబర్ 446ను పలువురు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారని తెలిపారు. చెరువును పూర్తిగా కబ్జా చేయకముందే సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటుచేయాలని ఆర్డీవోను కోరారు. స్పందించిన ఆర్డీవో సర్వే చేయించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ వెంకటేశంతోపాటు బబ్లూ, నారాయణ, బాలయ్య, బాబు, మోహన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వరల్డ్ హార్ట్ డే

రామారెడ్డి, సెప్టెంబర్ 30: సదాశివనగర్ మండలంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కాలేజీలో సోమవారం వరల్డ్ హార్ట్‌డేను నిర్వహించారు. జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జువాలజీ హెచ్‌వోడీ కె.వనజ పలు ఆరోగ్య విషయాలను వివరించారు. ఒత్తిడిని అధిగమించేందుకు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. గుండె ఆరోగ్యం తదితర విషయాలపై పేపర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులు, ప్రశంసాపత్రాలను అదజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉదయిణి, లైఫ్ సైన్సెస్ డాక్టర్ ఉజ్మాసుల్తానా, సింధూర, చంద్రకళ, అప్సా, రచన, నేహాఝాన్సీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పుట్‌బాల్ జట్టుకు ఎంపిక

పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామారెడ్డి, సెప్టెంబర్ 30: రాష్ట్రస్థాయి పుట్‌బాల్ జట్టుకు రామారెడ్డి ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ లింగం సోమవారం తెలిపారు. నిజామాబాద్‌లోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన అండర్-17 బాల, బాలికల ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన భార్గవ్‌రాజ్, నవీన్, తేజస్వీ, రజని, లతిక, వైష్ణవి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో బాలురు, మెదక్‌లో నిర్వహించనున్న పోటీల్లో బాలికలు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం వీరన్న, ఉపాధ్యాయు లు అభినందించారు.

సర్వే రిపోర్టును అందజేయాలి

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 30: మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామ చెరువు కబ్జాపై చేపట్టిన సర్వే రిపోర్టును అందజేయాలని గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువు కబ్జాకు గురవుతున్నదని ఫిర్యాదు చేయగా.. సర్వేయర్ అభిలాష్, ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్ మార్చి నెలలో మూడు రోజులపాటు సంయుక్త సర్వేను నిర్వహించారని తెలిపారు. అందుకు సంబంధించిన రిపోర్టును అందజేయాలని వారు తహసీల్దార్‌ను కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న జప్తిజాన్కంపల్లి గ్రామస్తులు

విద్యార్థులకు కంటి పరీక్షలు

విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యుడు

లింగంపేట, సెప్టెంబర్ 30: మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న 154 మంది విద్యార్థులను పరీక్షించారు. వారిలో ఎనిమిది మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఒక విద్యార్థికి మెల్ల కన్ను ఉన్నందున సరోజిదేవి కంటి దవాఖానకు రిఫర్ చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు తెలిపారు. కార్యక్రమంలో నేత్ర వైద్యుడు హరికిషన్, ప్రధానోపాధ్యాయుడు శేష య్య, రోటరీ క్లబ్ కామారెడ్డి శాఖ అధ్యక్షుడు రాజ నర్సింహారెడ్డి, కార్యదర్శి హరి, కార్యవర్గ సభ్యుడు శంకర్‌తోపాటు ఆరోగ్య కార్యకర్త పౌలవ్వ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 30: నిజామాబాద్ జిల్లా మంచిప్పలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ పోటీలో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న శివ బంగారు పతకం సాధించాడు. దీంతో అతడిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వర శర్మ, ఉపాధ్యాయులు శివను అభినందించారు. ఉపాధ్యాయులు మాణిక్యం, లాల్ సింగ్, యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, లలిత, కొండల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'పై నిర్లక్ష్యం

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 30: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, పరిష్కరించడం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజావాణిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టడంతో ఎవరికి వినతులు ఇవ్వాలో అ